

అనకాపల్లి రింగ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగులతో కలసి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పిడికిలి బిగించిన యువత

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' విజయవంతం
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలంటూ డిమాండ్
- మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదంటూ హెచ్చరిక
- అనకాపల్లి టౌన్ నుంచి ఐదు కిలోమీటర్ల మేర వందలాది బైక్‌లతో ర్యాలీ
- డిమాండ్లపై డీఆర్‌వో సత్యనారాయణకు వినతిపత్రం

సాక్షి, అనకాపల్లి :

యువత కదం తొక్కింది. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతమైంది. బుధవారం అనకాపల్లి టౌన్‌లో రింగురోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి జిల్లా పార్టీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు నేతృత్వంలో 'యువత పోరు' నిరసన ర్యాలీ హోరెత్తింది. సుమారుగా 5 కిలోమీటర్ల మేర వందలాది బైక్‌లతో నిరసన ర్యాలీ సాగింది. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు పిక్కటిల్లాయి. జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి యువత తరలి వచ్చారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. అనకాపల్లి టౌన్‌లోని రింగ్ రోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నాయుడు వీధి, రైల్వేస్టేషన్, రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర గల విజయరామరావుపేట, రామచంద్ర థియేటర్ రహదారి, నెహ్రూచౌక్ జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి బైక్, కార్లలో ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. 20 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని, నిరుద్యోగులకు తక్షణమే నిరుద్యోగ భృతి కల్పించాలని, డిగ్రీ, బీటెక్, పీజీ చదువులు అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఈ మూడు అంశాలపై జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని వినతిపత్రం అందజేస్తున్నామని మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు డీఆర్‌వోకు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం సమీపంలో వైఎస్సార్‌సీపీ నేతలు

మిగతా 8వ పేజీలో ▶



అనకాపల్లి పట్టణ పురవీధుల్లో యువతతో కలిసి బైక్ ర్యాలీగా వెళుతున్న పార్టీ నాయకులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులతో కలసి నిరసన



కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ర్యాలీలో నిరుద్యోగ భృతి అంతా భ్రాంతి.. ప్రచార బ్రోచర్ చూపుతున్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పేద విద్యార్థులకు 'చంద్ర' గ్రహణం : ముత్యాలనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు. పక్కన మలసాల భరత్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమం అత్యంత విజయవంతం అయ్యిందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలల పాలనలో యువతను, విద్యార్థులను, నిరుద్యోగులను నట్టేట ముంచిందని అన్నారు. ప్రతి పల్లెలో మద్యం ఏరులై పారుతుందని, మద్యం మీద చూపిస్తున్న శ్రద్ధ విద్యపై కూటమి ప్రభుత్వం చూపించడం లేదంటూ మండిపడ్డారు. 20 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ప్రతి నిరుద్యోగికీ రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు చేతులెత్తాశారని మండిపడ్డారు. ఈ హామీని అమలు చేయాలంటే ఏడాదికి రూ.7,200 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కానీ గత బడ్జెట్లో కేటాయింపులు లేవని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఈ ఏడాది కూడా ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి వైఎస్సార్‌సీపీ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే..ఇందులో 5 కళాశాలల్లో తరగతులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. మిగిలిన వాటిలో తరగతులు ప్రారంభించాల్సి ఉందని, కానీ వాటిని ప్రైవేటీకరించడానికి కూటమి సర్కార్ కుయుక్తులు పన్నుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందరికీ ఉచిత విద్య అందించాలనే ముందుచూపుతో అమ్మ ఒడి అందించిన ఏకైక సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. తక్షణమే కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం
కూటమి వైఫల్యాలపై ఎడతెగని పోరు
సంకల్పించిన పార్టీ శ్రేణులు
వైభవంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు. చిత్రంలో మాజీ ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, ధర్మశ్రీ, గణేష్, జోగులు, సమన్వయకర్త భరత్, జెడ్పీటీసీ అనురాధ తదితరులు


ప్రజాహితం కోసం పునరంకితం

అనకాపల్లి :

వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దిన వేడుకలు గ్రామీణ స్థాయి నుంచి నిర్వహించడం జరిగిందని, ప్రజల నుంచి పార్టీకి మంచి స్పందన వస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను బుధవారం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించి, కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో అత్యంత వైభవనంగా నిర్వహించడం జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలబడుతుందన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి, అధికారం చేపట్టిన తరువాత అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పిన హామీ కూడా తొమ్మిది నెలలుగా అమలు చేయకుండా నిరుద్యోగులను మోసగించిందని అన్నారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల గుండెల్లో నాటుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేయడంలో ఎంతో ప్రావీణ్యం సాధించిందన్నారు. తొమ్మిది మాసాల కూటమి పాలనలో ప్రజలకు ప్రభుత్వంపై పూర్తిగా విరక్తి కలిగిందన్నారు. ప్రజలు అందరూ ఎప్పుడు ముఖ్యమంత్రిగా తిరిగి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామా అని ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడి పార్టీగా వైఎస్సార్‌సీపీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. యువత పోరు కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారని

మిగతా 8వ పేజీలో ▶

అనకాపల్లి నూకలామ్మ జాతరకు రాష్ట్ర పండగ హోదా



సాక్షి, అమరావతి : అనకాపల్లి శ్రీనూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జరిగే కొత్త అమావాస్య జాతర రాష్ట్ర పండగగా నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. ఈ మేరకు దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేదల ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం



కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలను సత్వరం పూర్తి చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎస్సీ, బీసీ, ఎస్టీ, పీవీటీజీ లబ్ధిదారులకు గృహాలు మంజూరై వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న గృహాలకు అదనపు ఆర్థిక సహాయం అందజేయనున్నట్టు ఆమె వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇళ్లు' నిర్మించాలనే లక్ష్యంతో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.1 లక్ష చొప్పున అదనపు మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 13,548 మంది లబ్ధిదారులకు రూ. 70.04 కోట్లు అదనపు ఆర్థిక సహాయం అందచేస్తామన్నారు. మే నెలాఖరు నాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ధి సదవకాశాన్ని వినియోగించుకుని సొంతింటి కల సాకారం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బేబీ ఫీడింగ్ సెంటర్



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీపీటీ అధికారి పద్మావతి, రాంకీ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ

అనకాపల్లి: బాలింతలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సమయంలో పిల్లలకు పాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడకూడదని అనకాపల్లి, పాయకరావుపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) కె.పద్మావతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రాంకీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో బేబీ ఫీడింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె, రాంకీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.వాసుదేవరెడ్డి, కె.శ్రీకాంత్, ఇన్‌ఛార్జ్ డిపో మేనేజర్ రవిచంద్ర, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సలహాలివ్వండి

- రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ
- ఏప్రిల్ 30 లోగా సూచనలు, సలహాలకు ఆహ్వానం

తుమ్మపాల : దేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకుల నుంచి ఎన్నికల సంఘం సలహాలు, సూచనలు ఆహ్వానిస్తోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారం కాని సమస్యల కోసం ఎన్నికల సంఘం ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలను కోరిందన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో వచ్చిన సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన చట్రంలో కచ్చితంగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 31 నాటికి తీసుకున్న చర్యల నివేదికను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించినట్టు తెలిపారు.

మైదానంలోనూ తప్పని డోలిమోత



ఆస్పత్రికి గర్భిణిని డోలిపై తీసుకువెళుతున్న గిరిజనులు

గొలుగొండ : మైదాన ప్రాంతంలో కూడా గిరిజనులకు డోలిమోత తప్పడం లేదు. కొత్త ఎల్లవరం గ్రామ పంచాయతీ శివారు డొంకాడ గిరిజన గ్రామంలో ముఫ్వల మేరీని ప్రసవం సమయంలో కుటుంబ సభ్యులు గ్రామం నుంచి ఆరిల్లోవ ప్రధాన రోడ్డుకు నాలుగు కిలోమీటర్ల దూరం డోలిమోతతో తీసుకురావాల్సి వచ్చింది. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేరీని ప్రధానరోడ్డుకు తీసుకువచ్చి గొలుగొండ పీహెచ్‌సీలో చేర్పగా, అక్కడ మగబిడ్డకు జన్మనివ్వడం జరిగిందని ఆ గ్రామస్తులు తెలిపారు. రోడ్డు లేకపోవడం వల్ల నిత్యం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు వచ్చి రోడ్డు వేస్తామని చెప్పి నేటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారం రోజుల క్రితం రోడ్డు వేయాలని గ్రామం నుంచి ఆరిల్లోవ అటవీరోడ్డు వరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు, పండిన పంటను రోడ్డులేక బయటకు తీసుకువచ్చే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు వేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం: కిరండూల్–బచేలి స్టేషన్ యార్డ్ సంబంధిత భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్– విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్– విశాఖపట్నం (58502) పాసింజర్ ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

16న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, నిర్వాహకులు

మాకవరపాలెం : ఈ నెల 16 న జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల గోడపత్రికలను అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆవిష్కరించారు. జిల్లా చెస్ అసోసియేషన్, ప్రగతి చెస్ అకాడమీ సంయుక్తంగా తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం పోటీల గోడపత్రికను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకుడు సుధీర్ మాట్లాడుతూ ఈ పోటీలలో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిఉన్న వారు ఈ నెల 15లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9676514520 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో డానియల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అశ్లీల నృత్యాలు జరగలేదు'

నక్కపల్లి : వేంకటేశ్వర స్వామివారి వార్షికకల్యాణోత్సవాల సందర్భంగా ఉపమాకలో సోమవారం రాత్రి నిర్వహించిన డీజే కార్యక్రమంలో ఎటువంటి అశ్లీల నృత్యాలు జరగలేదని నక్కపల్లి సీఐ కుమార స్వామి వివరణ ఇచ్చారు. హోంమంత్రి ఇలాకాలో అశ్లీల నృత్యాలు శీర్షికన సాక్షిలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఆలయం వెనుక ప్రాంతంలో డీజే డాన్సు ప్రోగ్రాం నిర్వహించిన విషయం వాస్తవమేనన్నారు. అయితే సినిమాల్లో సెన్సార్‌బోర్డు అనుమతించిన పాటలకు మాత్రమే గ్రూపు సభ్యులు డాన్సులు వేసినట్టు చెప్పారు. పండగలు జాతర సమయాల్లో డీజే కార్యక్రమాలు, డాన్స్ బేబీ డాన్సు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సాధారణమేనన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహించిన డీజే కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలా లేదా, ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయవచ్చా అన్నది టీటీడీ పరిధిలో ఉంటుందన్నారు.

మా గ్రామాలకు రోడ్లేయండి మహాప్రభో!



తాడివలస వద్ద గొర్రె గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన ప్రజలు



బోడిమెట్ట మీద మోకాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

- మోకాళ్ల పై నిల్చుని గిరిజనుల వినూత్న నిరసన

మాడుగుల రూరల్ : మండలంలో గిరిజన గ్రామాలకు పోవు రహదారులు నిర్మించి, గొర్రిగెడ్డ మీద వంతెనలు నిర్మించాలని కోరుతూ ఏడు గ్రామాలకు చెందిన గిరిజనులు బుధవారం మోకాళ్ల మీద నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. శంకరం గ్రామ పంచాయతీ శివారు గిరిజన గ్రామాలు అయిన తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం, గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి, కొత్తవలస, మరియు తాడివలస వద్ద ఉరకగెడ్డల మీద వంతెనలు నిర్మించాలని ఏడు గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు, మోకాళ్ల మీద నిలబడి చంద్రబాబు మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, పవన్‌కల్యాణ్‌బాబు మా గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించండి అంటూ నినాదాలు చేశారు. వారికి మద్దతుగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి, కె. భవానీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రూ 9 కోట్ల 30 లక్షల వ్యయంతో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మిస్తామని నమ్మబలికి ఎన్నికలై 9 మాసాలు పూర్తి అవుతున్నా సరే కనీసం పట్టించుకోలేదన్నారు. గొటివాడ నుంచి కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు తాడివలస మీదుగా రాయిపాలెం, రాజంపేట మీదుగా కృష్ణంపాలెం తారురోడ్డు వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే వందలాది మంది గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్థానికుడు కాకపోవడం వల్ల ఇక్కడ గిరిజన ప్రజల సమస్యలు ఆయనకు తెలియవన్నారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ కూడా స్థానికుడు కాదని ఆయనకు కూడా స్థానిక సమస్యలు తెలియవని అన్నారు. వెంటనే గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సోమల నరసింహరావు, జన్ని చిన్నారావు, సోలం సన్యాసమ్మ, సోలం మంగ, గురువుల కృష్ణమూర్తి, ఈశ్వరరావు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

క్లస్టర్ శిక్షణతో నాణ్యమైన విద్య

- డీఈవో గిడ్డి అప్పారావునాయుడు



మాడుగుల క్లస్టర్ కాంప్లెక్స్‌లో శిక్షణ తరగతులు పరిశీలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

మాడుగుల: రానున్న విద్యా సంవత్సరంలో నాణ్యమైన విద్యను అందించడానికి క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు ఏటా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. బుధవారం మాడుగుల క్లస్టర్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలతో పాటు విద్యార్థులకు అర్థమయ్యేలా తరగతులు నిర్వహించడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. మండలంలో మాడుగుల, కేజేపురం, కింతలి క్లస్టర్ కాంప్లెక్స్‌లో 281 మందికి గాను 265 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.దేముడమ్మ, డీఈవో అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, కింతలి క్లస్టర్ అబ్జర్వరు రాధాకృష్ణమూర్తి, సీఆర్‌పీలు వొమ్మలి అచ్చుతరావు, బొబ్బిలి హరికృష్ణ, శారద, సురేష్, నిద్దాన సంధ్య, క్లస్టర్ హెచ్‌ఎంలు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయిలకింతాడ చెరకు కాటా వద్ద ఘర్షణ



బాహాబాహీకి దిగిన ఇరు పార్టీల నాయకులు, చెరకు రైతులు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ కాటా వద్ద చెరకు తరలింపు విషయంలో నెలకొన్న వివాదం రైతుల మధ్య తోపులాటకు దారి తీసింది. సీరియల్‌ను తప్పించి కాటా సిబ్బంది చెరకును తరలించడమే ఈ వివాదానికి కారణమైంది. చెరకు తరలింపులో గత రెండు రోజులుగా నెలకొన్న ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఇరువర్గాలతో కాటా వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి బుధవారం సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు, రైతులకు చెందిన చెరకు బళ్లను సీరియల్‌ను తప్పించి ఉద్దేశపూర్వకంగా తరచూ పంపిస్తున్నారని కాటా సిబ్బందిని బుధవారం రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీశారు. ఇలా అడ్డదారుల్లో పంపిస్తే రోజుల తరబడి కాటా వద్ద నిరీక్షిస్తున్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సీరియల్ నంబర్లు పొందిన కొందరు రైతులు లేకపోవడంతో సీరియల్ నమోదు కాని రైతులకు చెందిన చెరకు తరలించామని టీడీపీ నాయకులు, సిబ్బంది సమాధానం చెప్పారు. ఇలా సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీరియల్ పొందిన రైతులు లేకపోతే ఆ తర్వాత సీరియల్ నెంబర్లు కల్గిన రైతులను పిలవాలి తప్ప, సీరియల్ నమోదు కాని రైతుల చెరకును ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన నాయకులు ఒక్కసారిగా బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాలు అరుపు, కేకలతో తోపులాటకు దిగారు. అక్కడున్న మిగిలిన రైతులు సముదాయించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇకపై ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకుంటామని కాటా ఏవో కృష్ణమూర్తి ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో శాంతించారు.

వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ప్రారంభం



వసుంధర వజ్రాభరణాలు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బీవీ సత్యవతి

తుమ్మపాల: జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో తొలిసారిగా వజ్రాభరణాలు ఎగ్జిబిషన్ నిర్వహించడం శుభపరిణామమని మాజీ ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. వసుందర జ్యూయలరీ ఆధ్వర్యంలో వజ్రాభరణాల అమ్మకాల ఎగ్జిబిషన్‌ను బుధవారం స్థానిక విజయా రెసిడెన్సీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమెతో పాటు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ హారికా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటివరకు స్వర్ణాభరణాలు మాత్రమే చూశామని, వజ్రాభరణాలు ఎగ్జిబిషన్ కూడా నిర్వహించి మహిళలకు అందుబాటులోకి తీసుకురావడంపై వసుందర జ్యూయలరీ ప్రతినిధులను అభినందించారు. వసుందర జ్యూయలరీ వైస్ ప్రెసిడెంట్ టి.శ్రీదేవి మాట్లాడుతూ రెండు లక్షలకు పైగా విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన వారికి లక్కీ డిప్ ద్వారా డైమండ్ రింగ్ బహుమతిగా అందజేస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఎగ్జిబిషన్‌ను ఈ ప్రాంత ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లలిత ఫెర్రో పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన

అచ్యుతాపురం రూరల్ : రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి ఫెర్రో పరిశ్రమ ఎదుట కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. తమకు బకాయి వేతనాలు చెల్లించకుండా పరిశ్రమలో ఉన్న ఉత్పత్తిని దొంగతనంగా లారీల ద్వారా పంపించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలుసుకున్న కార్మికులు బుధవారం అడ్డుకున్నారు. ఉత్పత్తి మెటీరియల్ తరలిస్తే పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. కార్మికులందరూ అక్కడే మధ్యాహ్నం భోజనాలు చేసి నిరసన తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు ఇవ్వాల్సిన న్యాయబద్ధమైన వేతనాలు, గ్రాట్యూటీ ఇచ్చి కార్మికుల మనోభావాలు కాపాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు.

ఐదుగురు పందెంరాయుళ్ల అరెస్ట్



కోడిపుంజులు, నిందితులతో ఎస్‌ఐ రామకృష్ణారావు, సిబ్బంది

రోలుగుంట: కుసుర్లపూడి గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావు బుధవారం సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 4 కోడి పుంజులు, రూ.1520 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మడ అడవుల సంరక్షణతో తీర ప్రాంతాలకు రక్షణ



మొక్కలు నాటుతున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్

రాంబిల్లి (అచ్యుతాపురం): తీర ప్రాంత రక్షణకు దోహదం చేసే మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ పిలుపునిచ్చారు. రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారు సీతపాలెం బీచ్‌లో బుధవారం ఆమె మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకం, వాస్కా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మడ అడవుల అభివృద్ధి పథకంలో భాగంగా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత కాపాడటంలోనూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ మడ అడవులు నష్ట నివారణకు ఉపయోగపడతాయని తెలిపారు. నేల కోతను తగ్గించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ శాతం పెంచేందుకు మడ అడవులు దోహదపడతాయన్నారు. లక్షా డబ్బై ఐదు వేల నిధులతో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా మొక్కల్ని నాటుతున్నామని తెలిపారు. మడ అడవుల పెంపకానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని చెన్నయ్‌కి చెందిన ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్ సమకూరుస్తుందని తెలిపారు. అడిషనల్ కమిషనర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ వాస్కా ప్రాజెక్టుతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా లాలం కోడూరు పరిధిలో 24 ఎకరాలను ఎంపిక చేశామని తెలిపారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి,ఎం.ఎస్. స్వామినాథన్ శాస్త్రవేత్త నాగరాజన్, వాస్కా ప్రాజెక్టు స్టేట్ కో ఆర్డినేటర్ వనపర్ల సంతోష్ కుమార్, ఎంపీడీవో విజయ మాధురి, సర్పంచ్ గుణ, ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్, వాస్కా సిబ్బంది దండే ప్రసాద్ పాల్గొన్నారు.

219 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ల రెన్యువల్

తుమ్మపాల: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 219 మంది జర్నలిస్టులకు మరో మూడు నెలల పాటు అక్రిడిటేషన్ల రెన్యువల్‌కు ఆమోదం తెలిపినట్టు డీఆర్వో సత్యనారాయణరావు చెప్పారు. కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతిపాదనలను ఆమోదించామన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మరో మూడు నెలలకు(మే 31వ తేదీ వరకు) అక్రిడేషన్ రెన్యువల్‌కు ఆమోదించామన్నారు. ఆయా మీడియా సంస్థలు ఈ నెల 20వ తేదీలోగా లేఖలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.చంద్రరావు, వి.లోవరాజు, టి.రమేష్, హౌసింగ్ పథక సంచాలకుడు వై.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రంజిత్, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పడి ఒకరి మృతి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ వద్ద మంగళవారం విద్యుత్ స్తంభం పడి తీవ్ర గాయాల పాలైన బొత్స కామేశ్వరరావు(37) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. భెల్ వైపు నుంచి విశాఖ డెయిరీ వైపు వెళ్లేందుకు జంక్షన్‌లో బైక్‌పై వేచి ఉన్న ఆయనపై విద్యుత్ స్తంభం పడింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

15న జెడ్పీ స్థాయీ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 15న చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘం, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడికిలి బిగించిన యువత

▶7వ పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు.

కూటమి పాలనను ఛీకొడుతున్న జనం : కరణం ధర్మశ్రీ

అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ..వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'యువత పోరు' విజయవంతమైందని అన్నారు. యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోతే వైఎస్సార్‌సీపీ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజలకు అండగా నిలిచి ఇచ్చిన హామీలన్నీ నెరవేరేలా ఒత్తిడి తెస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 లక్షల 70 వేల కోట్లతో సంక్షేమ పథకాలందించామన్నారు. కూటమి అబద్ధపు హామీల కారణంగానే తాము ఓడిపోయామని..ప్రజలంతా ప్రశ్చాత్తాప పడుతున్నారని, కూటమి ప్రభుత్వాన్ని గద్దెదింపి మళ్లీ సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరుకుంటున్నారన్నారు.

పేదలపై కక్ష కట్టిన కూటమి...

మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, కన్నబాబురాజు, కంబాల జోగులు, అదీప్‌రాజ్, సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం దిగుతుందని మండిపడ్డారు. పేద పిల్లలకు పెద్ద చదువులు సాకారం చేస్తూ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తీసుకొచ్చిన మహానేత వైఎస్సార్ నిరుపేదల ఇళ్ల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు తయారు కావాలన్న సమున్నత లక్ష్యంతో నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నిరుద్యోగ భృతి అంటూ 2014–19లో ఒక్కసారి, మళ్లీ ఇప్పుడు రెండుమార్లు నిరుద్యోగులను భృతి ఇస్తామంటూ చంద్రబాబు మోసం చేశారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు పెట్టి, కాలేజీ యాజమాన్యాలను, విద్యార్థులను చంద్రబాబు ఇబ్బందులపాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ నిరసనలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జిల్లా పరిషత్ శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, మాజీ మార్కెట్ సలహా మండల చైర్మన్ చిక్కాల రామారావు, సీనియర్‌నేత శరగడం చినఅప్పలనాయుడు, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకట్, విద్యార్థి విభాగం బోడపాటి హేమంత్ , ఐటీ విభాగం అధ్యక్షుడు పల్లెల వెంకట సీతమ్మదొర, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలపార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గొవింద్, మలసాల కిశోర్, జాజుల రమేష్, ఎంపీపీలు రెడ్డి జగన్‌మోహన్, వైస్‌ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి వెంకట్రావ్, జెడ్పీటీసీలు కర్రిసత్యం, కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు జోసెఫ్ పాల్గొన్నారు.

ప్రజాహితం కోసం పునరంకితం

▶7వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, మాజీ ఎంపీ సత్యవతి, జిల్లా పరిషత్ శిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, 80వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కె.ఎం.నాయుడ, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మరిపల్లి శోభ, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, కోరుకొండ రాఘవ, కుండల రామకృష్ణ, పెతకంశెట్టి జోసెఫ్, పీలా రాంబాబు, ఉగ్గిన అప్పారావు, పలకా రాము పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ధర్మశ్రీ, భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, కన్నబాబు రాజు, జోగులు, మాజీ ఎంపీ సత్యవతి, ఇతర నాయకులు



రింగ్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహానేత మాజీ సీఎం వై.ఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా నాయకులు

సారా తయారు చేస్తే కఠిన చర్యలు



ఉగ్గినపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న విశాఖ జోన్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

కశింకోట: నాటు సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా ప్రోహిబిషన్ చట్టం–1995 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ జోన్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామచంద్రమూర్తి హెచ్చరించారు. మండలంలోని ఉగ్గినపాలెంలో నవోదయం–2.0 కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామసభ నిర్వహించి కళా జాతర ద్వారా నాటు సారాకు వ్యతిరేకంగా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీని నాటు సారా రహితంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం–2.0 కార్యక్రమం విజయవంతం కావడానికి అంతా సహకరించాలన్నారు. నాటు సారాకు సంబంధించిన ఫిర్యాదులను 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి. సుధీర్, సీఐ వై.లక్ష్మన్నాయుడు, కశింకోట ఎస్‌ఐ మనోజ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్‌ఐ గణేష్, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు దాడి.. వృద్ధుడి మృతి



మృతుడు సన్యాసి రావు (ఫైల్)

చోడవరం: సీపీఐ నాయకుడు దాడి చేయడంతో గాయపడిన వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం పట్టణం బాలాజీ నగర్ వద్ద ఇందల సన్యాసిరావు అనే వృద్ధుడికి సీపీఐ నాయకుడు నేమాల హరికి మధ్య ఈ నెల 3వ తేదీ రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సన్యాసిరావు బుధవారం మృతిచెందాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన హరి భార్య చోడవరం పంచాయతీలో వార్డు మెంబరుగా ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చోడవరం సీఐ అప్పలరాజు తెలిపారు.

రైతు బాంధవుడు 'నాగులాపల్లి' ఇక లేరు

- రాజాం మాజీ సర్పంచ్ మృతికి సంతాపం
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు





రాజాంలో సత్యనారాయణ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కార్మిక సంఘ నాయకులు, (ఇన్‌సెట్) సత్యనారాయణ(ఫైల్)



మేధాపాట్కర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్న సత్యనారాయణ(ఫైల్)

బుచ్చెయ్యపేట : మండలంలోని రాజాం గ్రామ మాజీ సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణ(67) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విప్లకారుడిగా, రైతు కూలీ సంఘం నాయకుడిగా పలు ఉద్యమాలు చేసిన ఆయన ప్రజల మనిషిగా పేరొందారు. ఆయన మృతికి పలు కార్మిక సంఘ నాయకులు, కార్మికులు, పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలుపుతూ సత్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సత్యనారాయణ తండ్రి నారాయణ రాజమండ్రి పేపరు మిల్లులో పని చేస్తూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేసేవారు. అక్కడ నుంచి చోడవరం అంకుపాలెం వచ్చి తరువాత బుచ్చెయ్యపేట మండలం రాజాం వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు నారాయణ, వెంకయమ్మ ఇద్దరూ ఉద్యమాల్లో పాల్గొనడంతో సత్యనారాయణ కూడా ఆ బాట పట్టారు. 40 ఏళ్ల పాటు ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో చురుగ్గా ఉంటూ ఓ దళానికి కమాండర్‌గా కూడా వ్యవహరించారు. ఉద్యమకారిణి మేధాపాట్కర్‌తో కలిసి పలు ఉద్యమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. ఐదేళ్ల పాటు విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించారు. తరువాత ప్రభుత్వం వద్ద లొంగిపోవడంతో ఆయనకు అనకాపల్లి జిల్లా కూండ్రం వద్ద ఐదెకరాలు ప్రభుత్వ భూమిని ఉచితంగా అందించారు. 1997లో మార్చిలో వడ్డాదిలో వ్యవసాయ కూలీ సంఘాన్ని స్థాపించి జిల్లాలో వేలాది ఎకరాల సీలింగ్, బంజరు, పోరంబోకు భూములను పేద ప్రజలకు పంచేలా చేశారు. 2014లో సర్పంచ్‌గా ఎన్నికై రాజాం గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. రాజాంలో ఆయన మృతదేహానికి అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సీఐఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు కనకరావు, రాష్ట్ర రైతు కూలీ సంఘం క్యాదర్శి దంతులూరి వర్మ, జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, కార్మిక సంఘ నాయకుడు ఐయితరెడ్డి అప్పలనాయుడు, తదితరులు ఈ అంత్యక్రియ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాంబికకు క్షీరాభిషేకం



అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దేవదాయ సహాయ కమిషనర్ సుజాత

అనకాపల్లి: ఉత్తరాంధ్ర **ఇలవేల్పు స్థానిక గవ** రపాలెం నూకాంబిక **అమ్మవారి ఉత్సవాన్ని (కొత్త అమావాస్య జాతర) రాష్ట్ర పండగ జర** పాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.సుజాత తెలిపారు. అమ్మవారి పంచలోహ విగ్రహానికి ఆమె బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఆలయ సమీపంలో బాణసంచా కాల్చి, భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి పండగ ప్రత్యేక అధికారి కె.శోభారాణి, ఆలయ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుమ్మపాల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



తుమ్మపాల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఏపీ ఆహార కమిషన్ సభ్యురాలు దేవి

అనకాపల్లి: తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏపీ ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న గర్భిణులు, ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమం గురించి ఆరా తీశారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పలు రికార్డులు తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పడాల రవికుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రామచంద్రరావు, తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నుశ్రత్ శామీమ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.శారదా, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిపై అవగాహన



ఫైలేరియా వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యాధికారులు

అనకాపల్లి టౌన్: స్థానిక జిల్లా మలేరియా కార్యాలయంలో ఫైలేరియా(బోద) వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ మాట్లాడుతూ ఫైలేరియా రోగులు ఇంటి వద్ద తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.రవికుమార్, కె.వరహాలు దొర, సిహెచ్ .సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 5,756 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,420
మొదటి రకం	3,650	4,150
రెండో రకం	3,300	3,820
మూడోరకం	3,000	3,280

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
పౌరుషం : సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేష్ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా : పర్లిసాయి
ఛావా : షిర్డీసాయి
కింగ్స్‌స్టన్ : వెంకటేశ్వర
తండేల్ : శ్రీసత్య
శుభం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు , బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

నరసాపురం ఆనకట్టకు లీకుల బెడద!

- గేట్ల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- దిగువకు వృథాగా పోతున్న సాగునీరు
- తక్షణం మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



నరసాపురం ఆనకట్ట



ఆనకట్ట గేట్లకు మరమ్మతులు లేక వృథాగా దిగువకు పోతున్న సాగునీరు

కశింకోట: శారదానదిపై ఉన్న నరసాపురం ఆనకట్టు నిర్లక్ష్యానికి గురవుతోంది. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట(ఏఎస్ పేట) గ్రామం వద్ద ఉన్న ఈ ఆనకట్టు గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ లీకులు ఏర్పడి దిగువకు సాగునీరు వృథాగా పోతోంది. ఇలా అయితే ఆయకట్టు భూములకు మున్ముందు సాగునీటి సమస్య ఏర్పడనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నరసాపురం ఆనకట్ట కింద సుమారు 3,200 ఎకరాల ఆయకట్టు ఉంది. కశింకోట, యలమంచిలి మండలాలకు చెందిన భూములు దీని కింద సాగవుతున్నాయి. ఆనకట్టు తరచూ దెబ్బతింటుండడంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్థానిక నాయకులు, రైతుల అభ్యర్థన మేరకు ఆనకట్టను శాశ్వత ప్రాతిపదికన జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్మించడానికి 2009లో రూ.16.17 కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టి తుది మెరుగులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిర్మించారు. దీన్ని 2017లో అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హడావుడిగా ప్రారంభించారు. అప్పటి నుంచి సాగునీటి కాలువ ద్వారా నీరు అందిస్తున్నారు. ఆ తర్వాత దీని నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆనకట్ట నుంచి శారదానది ప్రవాహంలో కొట్టుకు వచ్చే చెట్లు, తుప్పలు పోవడానికి, అత్యవసర సమయంలో తెరవడానికి నిర్మించిన నాలుగు గేట్ల నుంచి సాధారణం కంటే ఎక్కువ పరిమాణంలో నీరు వృథాగా దిగువకు పోతోంది. గేట్ల దిగువ భాగంలో రబ్బరు సీళ్ల దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇలా వృథాగా నీరు పోతే మున్ముందు ఆయకట్టుకు సాగునీటి కొరత తలెత్తుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గేట్లు పైకి ఎత్తడానికి ఉన్న ఐరన్ రోప్‌లు దెబ్బతిన్నాయి. అత్యవసర సమయంలో వరదలు వచ్చినప్పుడు, చెట్లు కొట్టుకు రావడం, ఇసుక అడ్డు పడటం వంటి సందర్భాల్లో గేట్లు ఎత్తడానికి అవకాశం లేని పరిస్థితి ఉంది. ఈ గేట్లు ఎత్తడానికి నాలుగు విద్యుత్ మోటార్లు కూడా ఆనకట్ట నిర్మాణ సమయంలో ఏర్పాటు చేశారు. అవి ఏనాడూ పని చేసిన దాఖలాలు లేవు. వీటికి విద్యుత్ సదుపాయం కల్పించ లేదు. దీంతో మోటార్లు ఎండకు ఎండి, వానకు తడిచి దెబ్బతిని పని చేయని దుస్థితికి చేరాయి. గేట్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీటి కొరత లేకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గేట్లకు మరమ్మతులు చేపట్టాలి



నరసాపురం ఆనకట్టు గేట్లు దెబ్బతిని లీకులు ఏర్పడ్డాయి. సాగునీరు వృథాగా పోతోంది. ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ఐరన్ రోప్ దెబ్బతినడం వల్ల గేట్లు అత్యవసర సమయంలో తెరుచుకోని పరిస్థితి ఉంది. తక్షణం గేట్లకు మరమ్మతులు చేపట్టాలి.

– **పిట్ట బుజ్జి, రైతు,** నూతలగుంటపాలెం గ్రామం

రూ.6 లక్షలతో ప్రతిపాదనలు

నరసాపురం ఆనకట్ట గేట్ల మరమ్మతుల కోసం రూ.6 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావలసి ఉంది. వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

– **రామకృష్ణ, ఏఈ,** నీటిపారుదల శాఖ, యలమంచిలి డివిజన్

భోజనం రుచికరంగా ఉండాలి



సమగ్ర బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యురాలు దేవి

కశింకోట: బాలికలకు రుచికరంగా ఆహారాన్ని అందించాలని ఏపీ ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె బుధవారం రాత్రి సందర్శించారు. బాలికలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అల్పాహారంగా ఇచ్చే పులిహోర బాగుండడం లేదని, ముద్ద అయిపోతుందని, అరకొరగా చెట్నీ వేస్తున్నారని, స్నాక్స్‌గా ఇచ్చే పల్లీల నాణ్యత లోపించిందని బాలికలు వాపోయారు. దీంతో స్పందించిన ఆమె ఆహార పదార్థాలను రుచికరంగా వండి సరిపడా పెట్టాలని, నాణ్యత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలతో మమేకమై వసతి గృహంలో సదుపాయాలపై ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాలును పరిశీలించి అక్కడ అందుతున్న సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహం సంక్షేమ అధికారి నిర్మల, ఐఈడీఎస్, విద్యాశాఖ, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలి



మొబైల్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి

తుమ్మపాల: లబ్ధిదారులకు సక్రమంగా, సకాలంలో రేషన్ సరకులు అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి, ఇతర అధికారులతో కలిసి మండలంలో రేబాక గ్రామంలోని పౌర సరఫరాల శాఖ గిడ్డంగిలో తనిఖీ చేశారు. స్టాకు, నాణ్యతపై ఆరా తీశారు. అక్కడి నుంచి తుమ్మపాలలో రేషన్ షాపు, మొబైల్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేశారు. స్టాకు వివరాలు తనిఖీ చేసి, కార్డుదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై, మహిళా, శిశు అభివృద్ధి, పాఠశాల విద్య, ఫుడ్ సేఫ్టీ, తూనికలు-కొలమానాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌ను ఢీకొన్న కారు



అదుపు తప్పి షెడ్‌ను ఢీకొన్న కారు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం-ముత్యాలమ్మపాలెం రహదారి సిమ్మన్నగారి గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఓ కారు ఢీకొనడంతో నిరుపేద మహిళకు చెందిన రేకుల షెడ్ స్వల్పంగా దెబ్బతింది. పరవాడ నుంచి ముత్యాలమ్మపాలెం వైపు వస్తున్న కారు తెల్లవారు జాము 3 గంటల ప్రాంతంలో వేగంగా వస్తూ, మలుపులో అదుపుతప్పి చెట్లను ఢీకొని ఎదురుగా ఉన్న చినతల్లి రేకుల షెడ్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రేకుల షెడ్డు, కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దెబ్బతిన్న రేకుల షెడ్డుకు కారు యజమాని కొంత నష్టపరిహారం చెల్లించి కారును అక్కడి నుంచి తరలించారు.

పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. వచ్చే నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, పరీక్ష ఏప్రిల్ 30న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక: పాటిపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీలకు రూ.200 ఎస్సీ, ఎస్టీలకు రూ.150 వంతున రుసుం చెల్లించాల్సి ఉందన్నారు. మరిన్ని వివరాలకు స్కూల్లో సంప్రదించాలని తెలిపారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

నక్కపల్లి: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయనవేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, బంగారయ్యపేట తదితర గ్రామాల్లో నవోదయం-2లో నాటు సారా తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కేసుల్లో శిక్ష పడిన వారికి రూ. లక్ష జరిమానా, ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకరత్నం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, అప్పలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలు



సారా తయారీ నిందితులతో ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్, సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని పెదబొడ్డేపల్లి, మెట్టపాలెం, కొంతలం, పెదపేట, గుర్రాలమర్రి, గిడుతూరు, అప్పన్నదొరపాలెం ప్రాంతాల్లో సారా తయారీ స్థావరాలు ఉన్నాయి. క్యాన్లలో విక్రయదారులకు సారా సరఫరా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.10 నుంచి రూ.20 వరకు ఆయా ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు చేపడుతున్నారు. సారా తయారీ, విక్రయించే వారిని సర్కిల్ పరిధిలో 181 మందిని గుర్తించారు. వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. వారందర్నీ బైండోవర్ చేశారు. సారా తయారీకి బెల్లం విక్రయించే 16 మంది వ్యాపారులను గుర్తించారు. ఎక్కువ మొత్తంలో బెల్లం విక్రయించవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. మరో వైపు దాడులు చేసి బెల్లం ఊట, సారా బట్టీలు ధ్వంసం చేసి, వంట పాత్రలను స్వాధీనం చేసుకుంటున్నారు. సారా తాగడం వల్ల కలిగే నష్టాలపై పట్టణాలు, వార్డులు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇందు కోసం ఎక్సైజ్ శాఖతో పాటు పోలీసు, రెవెన్యూ శాఖలు, సర్పంచ్‌లు, గ్రామ, వార్డు సభ్యులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేసి సభలు నిర్వహిస్తూ, ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.

వినకపోతే పీడీ యాక్టు



సారా విక్రయ, తయారీదారులను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బెల్లం వ్యాపారులకు కూడా అధిక మొత్తంలో బెల్లం విక్రయించవద్దని సూచించాం. పలువురిపై బైండోవర్ కేసులు పెట్టాం. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా చేసే వారు ఇక నుంచి మానుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. సారా తయారీ, విక్రయందారులు పట్టుబడితే రూ.2లక్షలు అపరాధ రుసుం విధిస్తున్నాం. అయినా తీరు మార్చుకోకపోతే పీడీ యాక్టు నమోదుకు చర్యలు తీసుకుంటాం.

– కె.సునీల్ కుమార్, ఎక్సైజ్ సీఐ, నర్సీపట్నం

ఏసీలో పాము పిల్లలు



ఏసీలో పాము పిల్లలను పట్టుకున్న కిరణ్

పెందుర్తి: వేసవి వచ్చింది..ఎండలు మండుతున్నాయి. ఏసీ దుమ్ము దులుపుదామనుకున్న ఓ వ్యక్తికి పాములు షాక్ ఇచ్చాయి. స్థానిక నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ ఇంట్లోని ఏసీని శుభ్రం చేసేందుకు బుధవారం ఉదయం సిద్ధమయ్యారు. ఏసీ తెరవగానే అందులో నాలుగు పాము పిల్లలను చూసి అవాక్కయ్యారు. వెంటనే నగరానికి చెందిన స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. కిరణ్ చాకచక్యంగా పాము పిల్లలను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు. ఇంట్లోని పడకగదిలో ఉన్న ఏసీలో పాము పిల్లలు ఉండడంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కె.కోటపాడు : ఆటోడ్రైవర్‌లు ప్రయాణ సమయాల్లో వాహన నిబంధనలను తప్పకుండా పాటించాలని కె.కోటపాడు ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ అన్నారు. కె.కోటపాడులో బుధవారం ఆయన ఆటోడ్రైవర్‌లతో సమావేశమయ్యారు. ఆటోలలో పరిమితికి మంచి పాసింజర్‌లను ఎక్కించరాదని, పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్ళే సమయాల్లో వారిని ఆటో వెనుక భాగంలో కూర్చోబెట్టరాదని తెలిపారు. బ్యాగ్‌లను ఆటోలకు వేలాడకుండా లోపల పెట్టుకోవాలని విద్యార్థులకు తెలపాలని, మితిమీరిన వేగంతో వాహనం నడపరాదని డ్రైవర్లను హెచ్చరించారు.

సబ్బవరం డిగ్రీ కాలేజీకి 'ఏ గ్రేడ్'

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల నిర్వాహణ, పరిపాలనా పరమైన అంశాలపై అధికారుల బృందం పరిశీలన పూర్తయింది. ఈ మేరకు బుధవారం పలు అంశాలపై చర్చించిన బృందం కళాశాలకు ఏ గ్రేడ్ మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఇందుకు సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ తనిఖీల్లో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కె.మల్లిబాబు, నర్సీపట్నం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కూలీల బకాయిలు చెల్లించాలి

చీడికాడ: గ్రామీణ ఉపాధి హామి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలని సీఐటీయు డివిజన్ కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వి.బి.పేట,శిరిజాం పంచాయితీలోని శివారు గ్రామాలైన గొప్పూరు,కొండెంపూడి,గదబూరు గ్రామాల్లో కూలీలతో కూడి పోస్టర్ విడుదల చేశారు. బకాయిలు చెల్లించండి లేదా తిండి పెట్టండంటూ నినాదాలు చేసారు. దేముడునాయుడు మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లో సుమారు కోటి రూపాయల మేర బకాయిలున్నాయని వెంటనే చెల్లించాలని అన్నారు.

మిగులు ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- ఈ నెల 25లోపు రైతులు అమ్ముకోవాలి
- నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ

నాతవరం: రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. మండల కేంద్రం నాతవరంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. తర్వాత పొలాల్లో నూర్పిడి చేస్తున్న ధాన్యాన్ని స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. హిమగిరి రైస్ మిల్లులో ఇంత వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని గత నెలలో పౌర సరఫరాల శాఖ అధికారులు అధిగమించారన్నారు. నాతవరం మండలంలో 5,623 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. ధాన్యం కొనుగోలు నిలుపుదల చేయగా.. నాతవరం మండలంలో రైతుల వద్ద ఇంకా మిగిలిపోయి ఉన్నాయని, ఈ నెల 25వ తేదీలోపు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట మండల వ్యవసాయ శాఖ ఏడీ ఉమాప్రసాద్, తహసీల్దార్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు



సీహెచ్ఎన్ అగ్రహారంలో ఉపాధి పనులపై జరుగుతున్న సోషల్ ఆడిట్ గ్రామసభ

తుమ్మపాల: ఉపాధి హామీ పనులపై బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన సోషల్ ఆడిట్ గ్రామసభలు వెలవెలబోయాయి. మండలంలో కూండ్రం, సుందరయ్యపేట, బవులువాడ, కోడూరు, రేబాక, సిహెచ్.ఎన్.అగ్రహారం గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ సమావేశాలు జరిగాయి.

2023-24 ఆర్థిక సంవత్సరం పనులపై సరైన లెక్కలు తీసుకోవడంలో సోషల్ ఆడిట్ బృందాలకు స్పష్టత లేకపోవడం, ముందుగానే కూటమి నాయకులు, ఫీల్డు అసిస్టెంట్లతో బేరాలు సాగించడంతో సోషల్ ఆడిట్‌పై పల్లెల్లో సరైన అవగాహన కల్పించలేదు. దీంతో గ్రామసభలకు కూలీలు రాకుండానే తుస్సుమనిపించారు. వందల సంఖ్యలో వేతనదారులు ఉన్నప్పటికి గ్రామ సభలకు 20 మంది వరకు మాత్రమే హాజరు కావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చోరీల నివారణకు సీసీ కెమెరాలు తప్పనిసరి

కశింకోట: చోరీల నివారణతో పాటు దొంగలను గుర్తించేందుకు ప్రజలు తమ ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలో దొంగతనాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఉదయం తాళాలు వేసి బయటకు వెళ్లి సాయంత్రం వచ్చేలోపు ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. ఒంటరిగా ఉన్న వారి ఇళ్లను, తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. దీని దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రయాణాలకు వెళ్లినప్పుడు ఇళ్లకు భద్రత కలిగిన తాళాలు అమర్చుకోవాలని, పొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా చర్యలు పాటిస్తే దొంగతనాలను అరికట్టవచ్చునన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు 100, 112 నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నివారణకు రాత్రి వేళ పోలీసు గస్తీ ముమ్మరం చేశామని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సమాజంలో మహిళ పాత్ర విశిష్టమైనది

- ఫార్మాసిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రోషిణిని సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

పరవాడ: సమాజంలో మహిళ పాత్ర చాలా విశిష్టమైందని విశాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొఠారి అన్నారు. విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని, ప్రసంగించారు. ఉద్యోగం చేస్తున్న గృహిణులపై మరింత పనిభారం ఉంటుందని, వీరికి భర్త, కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి మహిళ వృత్తి విరామ సమయానికి అవసరమైన డబ్బును పొదుపు చేసుకోవాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ ప్రతి మహిళకు విద్య అవసరమని, మహిళ అంటే అందం, అమాయకత్వమే కాదని మహిళ అంటే ధైర్యమని పేర్కొన్నారు. రాంకీ ఫార్మాసిటీ ఎండీ పి.పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ గృహిణిని మించిన ప్రణాళికా శాస్త్రవేత్త ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో భాగంగా రోషిణిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ పౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ డ్రాపౌట్లు తగ్గించేందుకు కృషి

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్ల శాతాన్ని తగ్గించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎస్‌సీఈఆర్టీ నిబంధనల మేరకు క్లస్టర్ సమావేశాలను నిర్వహించాలన్నారు. జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఆయన వెంట ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, సీఆర్పీలు, సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.